# తస్మాత్ జాగ్రత్త

ఆఫీసులోకి అడుగు పెట్టగానే నన్ను పలకరించిన వ్యక్తి విశ్వనాథం. పావుగంటలో నాకు ఆఫీసు సంగతులన్నీ చెప్పాడతను.

"ఇక్కడ వాళ్ళంతా దొంగలు బ్రదర్. నువ్వెవరి మాటా నమ్మకు. నమ్మావో నిన్ను పాతాళలోకానికి తొక్కేస్తారు. మన ఖర్మ కాలి, మనలాంటి వాళ్ళం, ఈ చవటల కింద పని చెయ్యాలి నొస్తోంది" అన్నాడు విశ్వనాథం, కాంటీనుకు నన్ను లాక్కుపోతూ.

నాకై నేనేమి అనలేదుగానీ, విశ్వనాథం చెప్పినంత ఘోరకలిగా మనుషులుండరేమోనని మాత్రం అనుకొన్నాను. ఆ క్షణాన నాకింకో అనుమానం కూడా కలిగింది - విశ్వనాథానికి మనుషుల మంచితనంమీద నమ్మకం పోయిందనీ, దీని కేదో దిక్కుమాలిన కారణం ఉండే ఉంటుందనీనూ.

"ఈ కాంటీన్ వెధవున్నాడు. ఉత్త లత్కోరు మనిషి.

మన మడిగితే నిమ్మకాయంత ఉప్మా ప్లేట్లో రాల్చి ముఖాన గిరాటేస్తాడు. అదే 'అయ్యగారు' అడిగారనుకో, రెండు కణికెళ్ళ ఉప్మా, అల్లప్పచ్చడి, కారప్పొడి, జీడిపప్పు పిక్కలు, వాడి ముఖం, వాడి మోర వేసి, పైనో పళ్ళెం బోర్లించి మరీ పంపుతాడు'' అన్నాడు విశ్వనాథం పక్కబల్లవాళ్ళకూ్కడా వినిపించకుండా.

''అలాగా!'' అన్నాను నేను సీదాగా.

''అరె! 'అలాగా' అని మెల్లిగా అంటావేమిటోయ్! ఈ టిఫిన్ తినలేక చస్తున్నాం బాబోయ్ అని గోలకెత్తినా అయ్యగారు వినిపించుకోరు గదా! అప్పటికీ ఓసారి నేను తెగించి అడిగేశాను. ఆయన నన్ను నమ్మనన్నాడు. కావలిస్తే రుజువు చేసుకోమన్నాను. ఏ గుణాన ఉన్నాడోగానీ, నాతో వచ్చాడు. తీరా వచ్చి చూద్దునుగదా బ్రదర్. ఇక నేనేం చెబుదునూ .... చ్ చ్ చ్'' అని ఆగిపోయాడు విశ్వనాథం.

నేనేమీ మాట్లాడ లేదు.

"అదే ఆఫీసులో ఉన్న చెడ్డరోగం. కాంటీన్ బాగు పడితే, నాకేం వొరుగుతుంది చెప్పు? అందరికీ మంచి టిఫిన్ దొరుకుతుంది. అలా జరిగితే, నాకెక్కడ కీర్తి వచ్చిపోతుందోనని, మిగతావాళ్ళ భయం. అందుకని వాళ్ళు ముందుగానే వెళ్ళి, హోటల్ వాడితో చెప్పారు. వాడు ఉద్దండ పిండం. మేమొచ్చే సరికి మూడేసి కణికెళ్ళ ఉప్మా ప్లేట్లల్లో పెట్టుకూ్కచున్నాడు. నాయనా ఇదీ వరస!"

కాఫీ వచ్చింది. విశ్వనాథం తనో చెంచాడు పంచదార వేసుకొని, నాకూ ఓ చెంచాడు వేశాడు.

"ఈ వెధవ కషాయం తాగడానికి, పూర్వ జన్మలో గోహత్య చేసిఉండా లనుకొంటానోయ్. డబ్బుకు డబ్బూ వదులుతుండె - సాయంత్రానికి కడుపులో మంటలు రేగుతుండె. పోనీ ఇంకెక్కడన్నా తాగుదామంటే - కాంటీన్ కాంట్రాక్టరు గోలకెత్తుతాడు. వెళ్ళి అయ్యగారి చెవిలో ఊదాడంటే, ఆరువారాలకు సరిపడిన పని నీమీద విరుచుకు పడుతుది. అందు కని, ఎవ్వడూ నోరెత్త డనుకో బ్రదర్."

వద్దంటున్న కొద్దీ అతనే బిల్లు తీసుకొన్నాడు. తనో సిగరెట్ అంటించి నాకోటి ఆఫర్ చేశాడు.

"అసలు నువ్విక్కడకు ట్రాన్స్ఫర్ కాకుండా ఉండ వలసింది. ఏం పీక్కుతిందామని వచ్చావో నాకు బోధపడ్డం లేదు. రామ రామ రామా! ఇంత పరమ ఛండాలుణ్ని నువ్వెక్కడా చూసి ఉండవనుకో భాయీ! ఎందుకూ, పది రోజులుంటే నీకే తెలుస్తుంది. 'వద్దుబాబోయ్' అంటూ పుట్టిం చోటుకు పరిగెత్తకపోతే నన్ను మారు పేరున పిలువ్. సరా?" అన్నాడు విశ్వనాథం.

'ఔ'ననో, 'కా'దనో నేను అప్పటికప్పుడే చెప్పదలచుకో లేదు. నా మట్టుకు నాకు మనుషు లందరూ మంచిగానే కనిపిస్తారు. దుర్మార్గులూ, నీచులూ లేరని కాదు. ఉన్నా వారిలోని మంచిని మనం చూడలేకపోతున్నా మేమో నని

నా అనుమానం. అయితే ఈ విషయాల మీద విశ్వనాథంతో నేను వాదించ దలచుకోలేదు. అతనూ మంచివాడే కావచ్చు; అందర్నీ తిడుతున్నాడంటే, అతని కారణాలు అతనికీ ఉండవచ్చు. అవేమిటో తెలుసుకోకుండా విశ్వనాథాన్ని గురించి ఏదో ఓ నిర్ణయానికి రావడం బొత్తిగా అన్యాయమనిపించింది ....

ఆ మొర్నాడో, మూడోనాడో గోపీ సినిమా హాలు దగ్గర కనిపించి "బావున్నారా" అంటూ 'విష్' చేశాడు. ఆ ప్రశ్న ఎందుకనో నాకు చాలా వికృతంగా వినిపించింది. సాయంత్రం ఐదుంబావుదాకా, ఒక్క చోటనే పనిచేస్తిమి; ఆరుంబావుకు 'బావున్నారా' అని అడిగితే అర్థమేమిటిట?

తనుకూడా ఈ సినిమాకే వస్తున్నానన్నాడు. ఇందులో 'దిలీప్' బ్రహ్మాండంగా దంచేశాడన్నాడు. 'మ్యూజిక్ మార్వెలెస్' అన్నాడు. తనేవెళ్ళి రెండు టిక్కెట్లు కొనుక్కొచ్చాడు. సినిమాల మీద నాకెంత అసహ్యమో చెప్పే అవకాశం కూడా లేకుండా, గోపీ నన్ను లోపలికి లాక్కెళ్ళాడు. ఇంత చనువు నామీద ఇతగాడి కెవరిచ్చారో తెలీదు.

నిజానికి మేం సినిమా చూడనేలేదు. గోపీ కబుర్లలోకి దించేశాడు. అవన్నీ ఆఫీసును గురించే. ముఖ్యంగా విశ్వనాథాన్ని గురించి గోపీ చాలా చెప్పుకొచ్చాడు.

"వాడు చాలా డేంజరస్ ఫెలో సార్. పైకి నవ్వుతూనే ఉంటాడు. భుజాల మీద చేతులు వేస్తూనే ఉంటాడు.

అందరూ దొంగలని చెబుతూనే ఉంటాడు. సమయం వొచ్చిందో, మీ గొంతుక్కాస్తా కత్తిరించేస్తాడు. ఆ తరవాత మీ ఇష్టం'' అన్నాడు గోపి.

"పైకలా ఉండడే మరి?'' అన్నాను.

గోపి నవ్వుతూ చప్పరించేశాడు.

"వాడిలో ఉన్న మెరిట్టే అది సార్. విరోధిని మనం గుర్తు పడతాం. వాడి దెబ్బనుండి కాచుకొంటాం. స్నేహితుణ్ని గుర్తుపడతాం. అతన్ని విశ్వసిస్తాం. అవునా? ఈ విశ్వనాథంగాడు మిత్రుని వేషంలో ఉంటాడు. బద్ధ విరోధికన్నా కనాకష్టంగా మన్ని హింసిస్తాడు. మీతో పూసుకు పూసుకు తిరుగుతుంటే మే మందరం భయపడి ఛస్తున్నాం. చెబుదామంటే, అవకాశమే లేకుండా పోయింది ........ ఇటువంటి గూండాల్ని మీరు చూసే ఉంటారనుకోండి. కానీ, చెప్పడం నా విధి కదా, అందులోనూ మీరు ఎక్కణ్నించో కొత్తగా వచ్చారాయెను... ఏమిటి తల పట్టుకొంటున్నారు?'' అన్నాడు గోపి.

"వొంట్లో బావోలేదు. తల్లో నాదుగా ఉంది. నే నింటికెడతాను.''

"అయితే నేనూ వస్తాను పదండి''

"మీరు సినిమా చూడాలనుకొన్నారు గదా, చూసి రండి పోనీ! నేను వెడతాగా!''

"వెధవ సినిమా పోనిస్తురూ!''

అతనే రిక్షా మాట్లాడి, అవసరమైతే ఇంటిదాకా వొస్తానని, నాచేత వొద్దనిపించుకొని మరీ వెళ్ళాడు.

నిజంగా ఆ రాత్రి నాకు జ్వరం తగిలినట్లనిపించింది. మనుషుల్ని గురించి, నాకు పూర్తిగా తెలుసునని కాదుగానీ, ఇంత విచిత్రమైన జాతితో ముఖాముఖిగా తలపడటం మాత్రం ఇదే మొట్ట మొదటిసారి.

ఆఫీసులో కెళ్ళడానికి నాకెందుకో భయం వేసింది. పదన్నా గొడవ జరుగుతుందేమోననీ, ఉన్న మనశ్శాంతి కాస్తా హరించి పోతుందేమోననీ హడలిపోయాను. గుబ గుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకొని లోపలికి అడుగుపెట్టాను. గోపి, విశ్వనాధమూ కలిసి గుసగుస లాడుకొంటున్నారు. నన్ను చూస్తూనే గోపి కన్ను మలిపాడు. నేనది గమనించానని, అతను గమనించి ఉండడు. అదే జరిగితే, కంట్లో నలక పడిందని, కళ్ళునులుముకొనీ, నోటి ఆవిరి పట్టీ, నానా అభినయమూ చేసి ఉండేవాడు.

"ఏకంగా కాఫీ తాగి కూచుందా మేమిటి?" అన్నాడు విశ్వనాథం.

"వచ్చి పది నిమిషాలయినా కాలేదు గదుటోయ్ - అప్పుడేనా?" అన్నాడు గోపి.

"హోరి నా చిట్టి తండ్రీ! అయ్యగా రింకా ఆఫీసుకు రాలేదు గానీ, వచ్చివుండి, నీ డైలాగ్ వింటే, మహదానందం పడేవాడోయ్ మానవుడు, ఆఫీసు పని అంటే నీకు

పంచప్రాణాలూ నని మేమిద్దరం ఏకగ్రీవంగా ఒప్పేసు కొన్నాం. ఇహాపద'' అన్నాడు విశ్వనాథం.

'రా' నంటున్న కొద్దీ వాళ్ళు లాక్కుపోయారు. మెట్లు దిగుతుండగానే జగ్గయ్య ఎదురయ్యాడు. 'దేవాలయా నికా?' అన్నాడు నవ్వుతూ.

"మరే'' అంటూనే ముందుకెళ్ళాడు విశ్వనాథం.

గోపీ నా భుజంమీద గోకి ముందుకు చూశాడు. విశ్వనాథం ఎదురుగా పోతున్నాడు.

"వీ డెప్పుడూ ఇంతేనండీ! ముగ్గురం కలిసిపోతున్నప్పుడు, చావో బ్రతుకో ముగ్గురమూ కలిసే ఉండాలామరి? బిల్లు నెత్తిన పడుతుందేమోనని, తప్పుకెడుతున్నాడు. ఛ ఛ. ఏం మనిషండీ?'' అన్నాడు గోపీ.

కాఫీ తాగుతున్నప్పుడు, విశ్వనాథమే సంభాషణ ప్రారంభించాడు.

"వీడు చవట సన్యాసి'' అన్నాడు విశ్వనాథం. "పదేళ్ళ నించీ ఉద్యోగం పడుస్తున్నాడు. ఫైల్ పుటప్ చెయ్యడం తెలియదు. ఇంక్రిమెంట్ రావడం లేదని లబ్బుమంటుంటాడు. ఆ మధ్య ప్రమోషన్‌కోసం చచ్చేటట్టు 'ట్రయ్' చేశాడు. ఏం లాభం? పెర్సనల్ ఫైల్ చూస్తే 'చవట' అని స్పష్టంగా రాసివుంది. ఎలా ఇస్తారోయ్ ప్రమోషన్?'' అన్నాడు విశ్వనాథం.

"బాగా అన్నావురా తండ్రీ! వజ్రంలాంటి ముక్క-

పడేశావ్. రెయ్యింబవళ్ళు, గూళ్ళు పడిపోయేలాగా పనిచేసే మనకే దిక్కులేదు. ఇక ఈ తాలాత్రోలీగాడికి ప్రమోషనా ? పైన భగవంతుడు లేడుట్రా నాయనా ?" అన్నాడు గోపి.

"ఉన్నాడున్నాడు. ఆయనకన్నీ తెలుసు బ్రదర్. అలా చూస్తూ చూస్తూ ఉంటాడు. ఎప్పుడో గుండెల కానేట్లు పెడతాడు. ఆ దెబ్బతో రోగం కుదురుతుంది. అందాకా ఆటలు సాగుతూనే ఉంటాయి" అన్నాడు విశ్వనాథం.

నాకు చిరాకెత్తిపోయింది.

"పోదామా ?" అన్నాను లేచి.

"అంత అర్జెంటు పని ఉంటే నువ్వెళ్ళు బ్రదర్ మేమో దమ్ము కొట్టుకొస్తాం" అన్నాడు విశ్వనాథం—

కుర్చీలో కూచున్నానన్న మాటేగానీ, మనస్సంతా మసగ కమ్మినట్లుగా ఉంది. ఒక్క లైనుకూడా రాయలేక పోయాను.

"అలా ఉన్నారేం ?" అన్నాడు జగ్గయ్య.

అతనెంత సేపట్నించి నాకేసి చూస్తున్నాడో తెలీదు.

"మనస్సేమీ బావుండలేదండీ !"

జగ్గయ్య నిట్టూర్చాడు.

"రండి. అలా సిగరెట్టన్నా కాల్చుకొందాం" అంటూనే జగ్గయ్య లేచి నా దగ్గర కొచ్చాడు.

అతనేదో నాతో చెప్పాలనుకొంటున్నాడనుకొన్నాను. సిగరెట్ కాల్చడంకోసం బయటి కెళ్ళనవసరం లేదుగా మరి !

"ఇటువంటిదేదో జరుగుతుందని, నేనప్పట్నించీ అనుకొంటూనే ఉన్నాలెండి!" అన్నాడు జగ్గయ్య ఓ సిగరెట్ వెలిగించి, చిటికెన వేలితో నుసి రాలుస్తూ.

"ఈ ఆఫీసునిండా దొంగలున్నారు. మీరు ఎంతో జాగ్రత్తగా ఉండాలి. తినే తినే విస్తట్లో మట్టి పోయడానికూడా భయపడరు. మీరింకా కొత్తవారుగనక, ఈ సంగతులన్నీ తెలియవనుకోండి- ఈ గోపి, ఎంత స్కాండ్రల్ అనుకొన్నారు ? ఆ మధ్య నాకు ప్రమోషనొచ్చేదండీ! సైంధవుళ్ళాగా వీడు అడ్డుపడ్డాడు. నామీద లేనిపోనివన్నీ, పైకెళ్ళి చెప్పాడు. నిజమా, అబద్ధమా అని, మావాడు ఆలోచించనన్నా ఆలోచించడు. గుడ్డిగా నమ్మేస్తాడు. అప్పటికీ నా పెర్సనల్ కారెక్టర్ని విచారించుకోమని పదిమంది పెద్ద మనుషుల పేర్లిచ్చాను. వీడూ, ఆ విశ్వంగాడూ, కలిసి, నేను రికమెండేషన్ పట్టుకొచ్చానని గోలచేశారు... ఏంచేస్తాం చెప్పండి! ఇటువంటి నీచుల మధ్య ఉండాలిసొస్తోంది మరి!" అన్నాడు జగ్గయ్య.

అతను సిగరెట్ కాల్చడం అయిపోయింది. బూటు కాలితో దాన్ని నలిపి, కాండ్రించి ఉమ్మాడు. జగ్గయ్య ఎంత బాధపడి ఉంటాడో నేనర్థం చేసుకొన్నాను-

సాయంత్రం నేను బయలుదేరబోయే ముందు, కృష్ణమూర్తి బల్లదగ్గర కొచ్చాడు.

"గోపీగాడూ, మీరూ రాత్రి సినిమాకెళ్ళారా?"

'ఔ' నని కూడా అనలేక తలూపాను.

"వాడితో మరీ అంత చనువుగా ఉండకండి. వాడిదగ్గర 'కారీ' చేసే గుణం ఉంది. ఆ లేకినాథంగాడు సినిక్. తన పొట్ట నిండితే పెళ్ళికూడు, నిండకపోతే తద్దినంకూడు.... జగ్గయ్య మాత్రం సామాన్యుడనుకొన్నా రేమిటి ? పైకి ఆపసోపాలు పడుతుంటాడు గానీ, వాడి కళ్ళెక్కడుండాలో అక్కడే వున్నాయనుకోండి ! ఒక్క మాటలో చెప్పాలంటే మీ రెవరి మాటా నమ్మొద్దు. వీళ్ళందరూ 'కానిబల్స్' మనిషిని నిలువునా విరుచుకు తింటారు. పాపం, పుణ్యం లేదు. దయాదాక్షిణ్యాలు లేవు. శుద్ధ లోఫర్స్. దట్సాల్" అన్నాడు కృష్ణమూర్తి.

నేనేమీ అనలేదు. నా చేత ఏదన్నా అనిపించాలని కృష్ణమూర్తి ప్రయత్నమనుకుంటా.

"మీరింకా 'ఆయన్ని' చూళ్ళేదుగా. రేపోసారి జ్ఞాపకం చెయ్యండి. ఇద్దరం కలిసి వెడదాం. మన మాటంటే గురను కోండి. జగ్గయ్యా- మాటమాత్రం నాతో అంటే, చిటికెలో పని చేసుకొచ్చేవాణ్ని. వాడెళ్ళి విశ్వనాథాన్ని ఆశ్రయించాడు. వాడో దగుల్బాజీ వెధవ. తన మాట కేదో పెద్ద విలవున్న దనుకొంటాడు. ఏమైందిట ?" అన్నాడు కృష్ణమూర్తి.

ఏమైందో నేను చెప్పకముందే వెళ్ళిపోయాడు. ఒక వేళ నిగ్గదీసి అడిగినా, నేనే సమాధానమూ చెప్పగలిగి ఉండే వాణ్ని కాదు. ఎందుకంటే రోజులు గడిచిన కొద్దీ, బొమ్మ

మరింతగా అలుక్కు పోసాగింది. మనుషులు, మనుషులకు మల్లే కనిపించడం మానేశారు. తోడేళ్ళనూ, మేకలనూ, నేను పోల్చుకోంటాను. కానీ ప్రతి తోడేలూ, తను మేక ననడమే కాకుండా, మిగతావన్నీ చిరతపులు లంటోంది. ఏది నిజమైన మేకో, నేను తెలుసుకో గలగాలి. లేదా, ఆ మందలో మిగతా వాటిలాగా నేనూ ప్రవర్తించాలి. ఆ రెండు పనుల్లో ఏ వొక్కటీ నెరవేరుతుందన్న ఆశ నాకు లేదు.